క్లుప్తంగా

నేడు గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

బంగారుపాళెంలో వర్షం



బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం

బంగారుపాళెం: మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. సాయంత్రం ఉన్నఫలంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని జోరుగా వర్షం కురిసింది. వర్షపు నీరు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వేపనపల్లెలో త్రైత సిద్ధాంతంపై ప్రచారం



వేపనపల్లెలో త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని వేపనపల్లెలో ఆదివారం ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు ధనంజయ మాట్లాడుతూ, త్రైత సిద్ధాంత భగవద్గీత చదివి ఆచరించడం ద్వారా మోక్షమార్గం పొందవచ్చని అన్నారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల వివరణ తెలుసు కోవడం వల్ల మధ్య ఆత్మల ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందన్నారు. అదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సమాజంలో నెలకొన్న కుల మతాలను రూపుమాపడానికి భగవద్గీత దోహదపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నగదు సాయం



చెక్కు అందజేస్తున్న కళాశాల నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తమ వంతు రూ.1 లక్ష సహాయం చేశారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని మురుగానపల్లెలో ఉన్న వివేకానంద (వీఎంకే) జూనియర్ కళాశాల నిర్వాహకులు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌కు చెక్కును అందజేశారు. కళాశాల నిర్వాహకులు మహేంద్రకుమార్, భాస్కరనాయుడు, కొంగారెడ్డిపల్లికి చెందిన సతీష్, రాహుల్ చౌదరి పాల్గొన్నారు.

లేగ దూడలు.. పాడి సిరులు



- జీవాల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- టీకాలు సరైన సమయంలో వేయాలి
- పోషణలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి
- దూడల పెంపకంతో రైతులకు మరింత ఆదాయం

ఐరాల: నేటి లేగ దూడలే రేపటి మేలు జాతి పాడి పశువులు. దూడ పుట్టినప్పటి నుంచి చేపట్టే సంరక్షణ పద్ధతులే కీలకం. ఇది గమనించి పాడి రైతులు దూడల పోషణ పద్ధతులు, తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ మాత్రం అశ్రద్ధ కనబరిచినా మరణాల శాతం అధికంగా ఉండి పరిశ్రమ కుంటుపడుతుంది. పాల ద్వారా వచ్చే ఆదాయంతో పోలిస్తే మన దొడ్లో పుట్టిన లేగ దూడ, పాడి పశువుగా ఎదిగితే వచ్చే లాభమే అధికం. లేగదూడలు మంచి పాడి పశువుగా అందిరావాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందని ఐరాల పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మావతి చెబుతున్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో లేగ దూడల పోషణ చాలా ముఖ్యం. పాడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందాలంటే లేగదూడల ఉత్పత్తే కీలకం. రాబోయే రోజుల్లో పాల ఉత్పత్తికి పునాదిగా మారుతాయి. పెయ్యదూడల సంరక్షణలో ఏ మాత్రం అశ్రద్ధ చేసినా, రాబోయే రోజులలో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. దూడ పెరుగుదల మూడింట రెండే వంతులు చివరి మూడు మాసాల చూడిలో ఉంటుంది. ఈ దశలో సరైన పోషణ అందిస్తే ఆరోగ్యవంతమైన, మంచి బరువు కలిగిన లేగ దూడ పుట్టడానికి దోహదం చేస్తుంది.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

దూడ పుట్టిన వెంటనే అరగంట లోపు తల్లిపాలు(జున్ను) తాగిస్తే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. దూడ పుట్టిన తర్వాత 3 నుంచి 7 రోజుల వరకూ తల్లికి జున్నుపాలు ఉంటాయి. జున్నుపాలు దూడకి పోషకాలను, ద్రవాలను అందిస్తాయి. ఈ జున్ను పాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతోపాటు దూడను అంటురోగాల బారి నుంచి కాపాడుతాయి. పాల ఉత్పత్తిని బట్టి దూడకు మొదటి మూడు 5 రోజులూ జున్నుపాలను ఇవ్వాలి. పుట్టినప్పుడు ఇచ్చే జున్నుపాలతో పాటు దూడలకు మొదటి 3 నుంచి 4 వారాల పాటు పాలు ఇవ్వడం అవసరం. దాణాలో మొక్కజొన్న, సోయా, వేరుశనగ చెక్క కలిపి రోజుకు 50 గ్రాములు అందించాలి. తర్వాత దూడలు కొద్ది కొద్దిగా గడ్డిలోని పిండి పదార్థాలను అరిగించుకోగలుగుతాయి. ఆ పైన కూడా పాలు తాగిస్తే పోషక పరంగా మంచిదే. దూడలకు మేతనిచ్చే పాత్రలను చాలా శుభ్రంగా కడగాలి. సంబంధిత సామగ్రిని శుభ్రంగానూ, పొడిగా ఉన్నచోటా ఉంచాలి.

టీకాలు సరైన సమయంలో ఇవ్వాలి

దూడ పుట్టిన ఏడు నుంచి 21 రోజులు, ఆపైన నెలకోసారి అంతర పరాన్న జీవులు లేకుండా నట్టల నివారణ మందు తాగించాలి. పుట్టిన వారం నుంచి వారానికోసారి విటమిన్ల మిశ్రమాన్ని అందించాలి. పుట్టిన 2, 3 రోజుల్లో ధనుర్వాతం రాకుండా టెట్ వ్యాక్స్ టీకా వేయించాలి. నాలుగు నెలల వయసు నుంచి ఒక ఏడాది వరకు గాలికుంటు, గొంతువాపు, జబ్బవాపు టీకాలు సరైన సమయంలో వేయాలి.

లేగ దూడలను కాపాడుకుంటే సిరులే

లేగదూడలను కాపాడుకుంటే పాడి పరిశ్రమ సిరులు కురిపిస్తోంది. ఎక్కువమంది రైతులు పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయంలో నష్టం వాటిల్లినా, కరువు కాటకాలు సంభవించినా పశు సంపద బతుకుదెరువుకు ఆర్థిక భరోసానిస్తుంది. ఇదంతా లేగదూడల సంరక్షణ తోనే సాధ్యమవుతుంది. పశువులు చూడితో ఉన్నప్పటి నుంచి దూడ పుట్టే వరకు పోషణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మేలుజాతి పశువులు తయారవుతాయి.



ముందస్తు నిర్వహణ

పుట్టిన వెంటనే ముక్కులో, నోటిలో ఉన్న మావి పొర లేదా జిగురు పదార్థాన్ని (శ్లేష్మం) తుడిచివేయాలి. సాధారణంగా పుట్టిన వెంటనే దూడను ఆవు నాకుతుంది. దీనివలన దూడ పొడిగా అయి శ్వాసక్రియకు, రక్తప్రసరణకు తోడ్పడుతుంది. ఆవు అలా నాకని పక్షంలో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు దూడను పొడి బట్ట లేదా గోనె సంచీతో రుద్ది పొడిగా చేయాలి. ఛాతీ భాగాన్ని చేత్తో ఒత్తి వదిలిపెడుతూ కృత్రిమ శ్వాసను అందివ్వాలి. బొడ్డును శరీరానికి 2 నుంచి 5 సెం.మీ దిగువ దారంతో కట్టి ముడి దిగువ భాగంలో 1 సెం.మీ దూరంలో కత్తిరించి టించర్, అయోడిన్ లేదా బోరిక్ ఆమ్లం అద్దాలి. పశువుల దొడ్డిలో నేల మీద తడిగా ఉంటే దొడ్డిని శుభ్రంగా, పొడిగా ఉంచాలి. దూడ యొక్క బరువును తూచి నమోదు చేయాలి. ఆవు పొదుగును క్లోరిన్ ద్రావణంతో కడిగి ఆరనివ్వాలి. దూడ మొదటగా తల్లిపాలు(జున్ను పాలు) తాగడానికి వదలాలి. తద్వారా ఒక గంటలో దూడ నిల్చొని పాలు తాగడానికి ప్రయత్నిస్తుంది. దూడ బలహీనంగా అది నిల్చువడానికి సహాయం చేయాలి.



లేగదూడల పెంపకంలో శ్రద్ధ వహించాలి



లేగదూడల పెంపకంలో పాడి రైతులు శ్రద్ధ వహించాలి. దూడ పుట్టిన వెంటనే 6 గంటల్లోపు జున్నుపాలు తాగేలా చూడాలి. అవి మట్టి తినకుండా చూసుకోవాలి. లేదంటే బ్యాక్టీరియా క్రిములు చేరి వ్యాధులు సంభవిస్తాయి. శరీర బరువుని బట్టి 3 మాసాల వరకు తగినన్ని జున్నుపాలు తాగనివ్వాలి. దూడకు 15 రోజుల వయసు నుంచి లేత పచ్చ గడ్డి మేత తినడం అలవాటు చేయాలి. దూడలకు వారం లోపల మొదటి సారి, తర్వాత ప్రతి నెలకోసారి నట్టల మందు తాగించాలి. లేగదూడల ఆరోగ్య సంరక్షణ పాడి పశువుల పెరుగుదల మరియు పాల ఉత్పాదన శక్తి చాలా ప్రభావం చేస్తుంది. కావున లేగదూడల పెంపకంలో పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

–పద్మావతి, పశుసంవర్ధక శాఖ ఏడీ, ఐరాల

ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడికి సన్మానం



సుబ్రమణ్యంను సన్మానిస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగి, క్లాస్–4 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంకు ఇటీవల డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం క్లాస్–4 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా పలు రంగాల్లో సేవలు అందించిన 29 మందికి ఢిల్లీలోని ఎంబీఆర్ యూనివర్సిటీ తరఫున డాక్టరేట్‌లు ప్రదానం చేశారన్నారు. అందులో భాగంగా మన రాష్ట్ర పరంగా సామాజికసేవ, యూనియన్ లీడర్‌షిప్ కేటగిరిలో సుబ్రమణ్యంకు అవార్డు ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆల్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ క్లాస్–4 ఉద్యోగుల సంఘం గౌరవఅధ్యక్షులు ఉమాపతి, జిల్లా అధ్యక్షులు హరికృష్ణ, ఉపాధ్యక్షులు మురుగేష్, కార్యదర్శి మునికృష్టారెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి రాజా, నాయకులు మురుగేషన్, రమేష్, బంగారుపాళ్యం జ్యోతి, సుబ్రహ్మణ్యం, మునికృష్ణయ్య, చిన్నస్వామినాయుడు పాల్గొన్నారు.

ఆలోచనా విధానాన్ని బట్టే మన జీవితం



ప్రసంగిస్తున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ లక్ష్మీ ప్రసూన, హాజరైన ధ్యానులు

తవణంపల్లె: ఆలోచనా విధానాన్ని బట్టే మన జీవితం ఆధారపడి ఉంటుందని తిరుపతికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ లక్ష్మీప్రసూన పేర్కొన్నారు. కాణిపాకం సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో ఆదివారం మూడు రోజుల ఆత్మజ్ఞాన, ఆరోగ్య శిక్షణా శిబిరంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఎప్పుడూ వర్తమానంలో జీవించాలన్నారు. గతాన్ని ఆలోచించుకుంటూ కూర్చుంటే వర్తమానంలో ఏమీ చేయలేమని, తద్వారా భవిష్యత్ పూర్తిగా దెబ్బతింటుందని చెప్పారు. మానవుడు మాధవుడిగా ఎదగడానికి ధ్యానం దోహదపడుతుందన్నారు. అనంతరం జిల్లా పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ అధ్యక్షుడు గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక ఆమెను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి ధ్యానులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీతో బంగారు రుణాలు

గుడిపాల: తక్కువ వడ్డీతో బంగారు రుణాలను అందజేస్తున్నట్లు సింగిల్‌విండో సీఈఓ పట్టాభి తెలిపారు. గుడిపాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా తక్కు వడ్డీపై తక్షణ మే బంగారంపై రుణాలను అందిస్తామన్నారు. బంగారంపై రుణాలు కావలసిన వారు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని తీసుకువచ్చినట్లయితే వెంటనే అందజేస్తామన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం



ప్రజలతో మాట్లాడుతున్న ఏడీ కొండయ్య

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి దళితవాడలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని ట్రాన్స్‌కో ఏడీ కొండయ్య తెలిపారు. గుండ్లకట్టమంచి దళితవాడ ప్రజలు విద్యుత్ సమస్యపై శనివారం రాత్రి చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఏడీ ఆదివారం దళితవాడలోని ఇళ్లను సందర్శించారు. ఈ నెల 19వ తేదీ రాత్రి విద్యుత్ షాక్ కారణంగా గ్రామానికి చెందిన నాగయ్య, అతని మనవడు రాజ్‌కుమార్ మృతి చెందారని గ్రామస్తులు ఏడీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ, సమస్యను పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన నాగయ్య, రాజ్‌కుమార్‌కు విద్యుత్‌శాఖ తరఫున అందాల్సిన పరిహారాన్ని అందించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

6న ముస్లిం ఆత్మీయ సమావేశం



పోస్టర్ ఆవిష్కరణలో ముస్లిం ఐక్యవేదిక నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 6న జరిగే 'ముస్లిం ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు జాఫర్‌పులి పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశ పోస్టర్లను ఆవిష్కరించారు. జాఫర్ పులి మాట్లాడుతూ ముక్కలుగా ఉన్న ముస్లిం సమాజాన్ని ఒక్కటి చేస్తూ, రాజకీయ పార్టీలకు, జమాతులకు అతీతంగా ముస్లిం ఐక్యవేదిక పని చేస్తుందన్నారు. రాజ్యాంగ హక్కుల సాధన, సంక్షేమంలో సమానత్వం, రాజ్యాధికారం, ముస్లిం సామాజికవర్గ అవసరాలు, సమస్యలు, ముస్లిం సామాజికాభివృద్ధికి అవసరమయ్యే ప్రతి అంశం మీద ముస్లిం ఐక్యవేదిక పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం ముస్లిం ఐక్యవేదిక సంపూర్ణ సామాజిక అధ్యయనం, సంపూర్ణ సామాజిక ప్రక్షాళన, సంపూర్ణ సామాజిక చైతన్యం, దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం పనిచేస్తూ భావితరాలకు ఒక దిక్సూచిగా మారాలన్నదే ముస్లిం ఐక్య వేదిక అంతిమ లక్ష్యమన్నారు. చిత్తూరు ఉర్దూ షాదీఖానాలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, సెక్రటరీ సయ్యద్ నూర్, ఉపాధ్యక్షుడు రషీద్, జిల్లా కార్యదర్శి ఇనాయతుల్లా, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ పాల్గొన్నారు.

వాయు, శబ్ద కాలుష్యాలను అరికట్టాలి



అవగాహన కార్యక్రమంలో సైకిలిస్టులు

చిత్తూరు కలెక్టరేట్: వాయు, శబ్దకాలుష్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని వైద్యులు భరత్‌రెడ్డి, జయంత్ అన్నారు. ఈ మేరకు చిత్తూరు నగరంలోని సైకిలిస్టులు ప్రపంచ కార్ ఫ్రీ డేను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు నగరంలోని గాంధీ విగ్రహం నుంచి దర్గా సర్కిల్, గిరింపేట, కొంగారెడ్డిపల్లి, సంతపేట పలు ప్రాంతాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం కారు, ద్విచక్ర వాహనాలనే వినియోగించకుండా సైకిల్‌ను వినియోగించాలన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. వాయు, శబ్ద కాలుష్యాలను తగ్గించడం కోసం చేపట్టాల్సిన అంశాలపై అవగాహన పెంచేందుకు ప్రతి ఏటా కార్ ఫ్రీ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, వినోద్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాట్యం.. అబ్బురం!









కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలోని ఆస్థానమండపంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను మైమరిపించాయి. హరికథలు, గీతాలాపానలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు వినోదభరితంగా సాగాయి. కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కళాకారులు ఇచ్చే ప్రదర్శనలకు చూపరులు వేదిక వైపే వాలిపోయారు. అనంతరం కళాకారులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.









వైభవంగా అర్జున తపస్సు



తపస్సుమాను వద్ద పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ఆదివారం సాయంత్రం అర్జున తపస్సు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకులసహదేవుల విగ్రహాలకు అభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి తపస్సుమాను దగ్గర ఉంచారు. కళాకారుడు మణి అర్జున వేషధారణ ధరించి తమిళంలో పద్యాలు పాడుతూ తపస్సుమానును అధిరోహించారు. తపస్సుమాను దగ్గర సంతానం లేని మహిళలు భక్తితో తడిబట్టలతో వరపడ్డారు. అర్జునుడు తపస్సుమానుపైనుంచి భక్తులకు వీబూది, నిమ్మపండ్లు, బిల్వ ఆకులు, బొరుగులు చల్లగా పోటీపడి పట్టుకొన్నారు. అనంతరం ద్రౌపదీదేవి, పాండవుల విగ్రహాలను ఊరేగించారు.



తవణంపల్లెలో తపస్సుమానును అధిరోహిస్తున్న అర్జునుడు

డీఎల్‌డీఓ రవికుమార్ పులివెందులకు బదిలీ

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) రవికుమార్ పులివెందుల డీఎల్‌డీఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు నుంచి వసుమతిని నియమించారు. పలమనేరు డీఎల్‌డీఓ స్థానం ఖాళీగా ఉండగా ఆ స్థానంలో సూళ్లూరుపేటలో పనిచేస్తున్న డీఎల్‌డీఓ శేషయ్య నియమితులయ్యారు. దీంతో ఇక్కడి పోస్టు భర్తీ అయింది.